

# లేత హృదయం

శ్రీ రామారాయ్‌వర్మ

నీలాకాశంపై నచ్చటచ్చటా కో నక్షత్రం మెరుస్తుంది. వాయుదేవుని చిరునాదానికి నదీలలామ పరవశ నొందింది— సంతోషాన్ని చిరుతరంగాలుగా ఉబక వేసి నాట్యమాడిస్తుంది. చంద్రకిరణాలు తరంగాలకాభరణా లయినయి.

గోపాల్ని ప్రక్కను పరుండబెట్టుకుని చంటిబిడ్డను వక్షంపై నిడుకుని పరుండి చందమామను చూపి ఆడిస్తుంది నలిని. గోపాల్‌వైపు తిరిగి గోపీ! ఈవేళ బడికి సరిగా వెళ్ళేవా? అంది తల్లి.

లేదమ్మా!

ఏం?

చక్రవర్తి పుట్టినరోజట కదూ.

ఊఁ...

అమ్మా! నా పుట్టినరోజెప్పుడే? నంటూ లేచి తల్లి తల నిమురుతూ కూర్చున్నాడు గోపాల్.

నీ పుట్టినరోజు...

రేపు కదమ్మా?

ఎవరన్నారు?

మరి, అప్పుడు నాన్నకు చక్రవర్తి పుట్టిన రోజునే కదూ అదేదో ఇచ్చేరు? అమర్నాడే నా పుట్టినరోజు చేసేరు కదూ! నన్ను సినిమాకు తీసుకెళ్ళేరు కదూ? అవును నాన్నా! అంది. ఒక్కసారిగా లేచి చెరుగుతో కళ్ళు తుడుచుకుని చంటిబిడ్డను ముద్దాడింది.

ఏం అమ్మా? అన్నాడు కంగారుతో గోపాల్ తల్లి గడ్డం పట్టుకుని, కుర్రవాన్ని కంగారుపడనీకుండా వాయుదేవుడు ఇద్దరి మొహాలకు చెరుగు నడ్డంచేసేడు.

గోపాలం తండ్రి ఓ పిల్ల జమిందారు. ఉన్న జమీ అన్నదమ్ము లిద్దరికీ ఉమ్మడి. గోపాల్ తండ్రే చిన్నవాడు. అప్పటికి చనిపోయి ఎనిమిది మాసాలవుతుంది. అతను చనిపోవటంతోనే నలిని బావగారు జమీనంతా ఆక్రమణం చేసుకుని వెళ్లగొట్టేడు. విధిలేక నలిని కార్మిక గృహాల్లో ప్రవేశించి ఆరుమాసాలవరకు ఉన్న వస్తువు లమ్ముకుంటూ కుర్రవానిచదువు చెప్పించుకుంటూ ఉండేది. నలిని బిడ్డలను చూచింది. జీవనాధారం కనపడలేదు. ఇరుగు పొరుగు స్త్రీలతో ఆమెకూడా మిల్లులో పావలా కూలికి ప్రవేశించింది. మొదటిలో ఆమెకు కూలిచేయటం అంటే చిన్నతనం, కష్టంగాను ఉండేది, గాని క్రమేణా అలవాటైపోయింది.

గోపాల్ పుట్టినరోజు సంగతి ఎత్తేసరికి ఆమెకు

పూర్వస్థితి జ్ఞప్తికొచ్చింది. చెరుగుతీసి కళ్లు తుడుచుకుని 'లేవే నీపుట్టినరోజు బాబూ' అని కొడుకును కౌగలించుకుంది.

తెల్లవారుజాము నాలుగు గంటలకే మిల్లు కూతేసింది. నళిని లేచి నిద్రపోతున్నా పిల్లల్ని చూసింది. ఏమనుకుందో తిరిగి బిడ్డలమీద చేయివేసుకు పడుండి పోయింది.

రమేశం యిరువైసంవత్సరాల కుర్రాడు. ఇతను మిల్లు యజమాని కొడుకు. కాలేజీనుంచి కారుమీద కార్మికుల వీధిలోంచే ఇంటికి పోతూంటాడు. పనివాళ్లతోటి విద్యార్థులు ఇతన్ని ఎంతో మంచివాడని పొగుడుతారు. నిజంగా అల్లాంటివాడేగాని గతమాసంనుంచి ఓసారి మిల్లునుంచి వెళ్ళిపోతున్న నళినిని చూడగానే అదో మాదిరి ప్రేమ బయలుదేరింది లేతహృదయంలో. అప్పుడప్పుడు గోపాల్‌ని పల్కరించి బేడా పావలా ఇచ్చేవాడు. రమేశం తండ్రికి ఒకడే కొడుకు కన్నతల్లి పురుట్లోనే పరలోకానికేగింది. ఆ రెండో ఏటనే తండ్రి రెండో వివాహం చేసుకున్నాడు. ఈమెకు పదిసంవత్సరాల ఆడపిల్లతప్ప మరే సంతానంలేదు. రమేశానికి మారటి ప్రేమ కష్టం అనిపించేది. ఒకో సమయంలో తండ్రిమీదకూడా కోపంవచ్చేది. చిన్నతనం, నా, అనేవారు అరుదు అనిపించేది. పాపం గాని అంత ధనముండి కూడా చిల్లరచేష్టల్లోకి దిగలేదు. ప్రథమ పుష్పం ముప్పయిసంవత్సరాల నళినిపై పడ్డది.

ప్రొద్దుటే లేచి పిల్లాడికి నీళ్లుపోసి రోడ్డువైపే చూస్తూంది నళిని. కాలేజీ శెలవు. అందుచేత రమేశం ప్రొద్దుటే మిత్రులదగ్గరకు బయలుదేరేడు కారుమీద. నళిని గుమ్మం ముందు కొచ్చింది కారు. ముసుగు సర్దుకుని నమస్కారంచేసి ఆగమని చెయ్యి ఆడించింది. రమేశం కారు దిగి ఇంట్లో ప్రవేశించేడు. గదిలో సామానంతా మూలకు త్రోసి ఓ చింకిజంబుఖాన వేసింది. రమేశం కూర్చోలేదు, అతని హృదయం కారుకన్నా వేగంగా పరువెత్తుతుంది. నళిని తలవంచుకుని సేట్! అంది.

ఏం నళిని?

నళిని కండ్ల వెంబడి నీళ్లుకారి పోతున్నయి, చూడగానే రమేశం లేతహృదయం కరిగిపోయి ఆమెను కౌగలించుకుని ఆమె బుజంమీద కన్నీటి చుక్కలు కార్చేడు. నళిని హృదయం ఏమీ చలించలేదు, ఏ భావం కలుగలేదు. తనస్థితి, ఆనాటిసంగతి చెప్పుకుంది.

నళినీ! నిన్ను ప్రేమించేను అన్నాడు తొట్రుపాటుతో.

తప్పుకదూ సేట్? అంది నళిని ధైర్యంతో అతన్ని చూస్తూను. రమేశం తలెత్తి దీనంగా చూసేడు తప్పుకదూ నాయినా! అంది మరోసారి.

రమేశం నోటమాట రాలేదు కాసేపటివరకు, గాని ఆవేదన అశ్రుధారలగా వెలువడుతుంది. నళినికి రమేశం స్థితి, అతని సవతితల్లి కాఠిన్యం జ్ఞప్తికొచ్చినయి. ఓ నిట్టూర్పు విడిచింది. రమేశం జేబులోంచి పదిరూపాయల నోటుతీసి కుర్రాడికిచ్చి కారుదగ్గరకు వెళ్ళేడు- సేట్ మూరాజ్!! అంది నళిని, కారు తిరిగి వెనక్కి ఇంటికి పోయింది.

మధ్యాహ్నం పన్నెండయింది. గోపాల్ శుభ్రమైన బట్టలు కట్టుకొని కూర్చున్నాడు, తల్లి రొట్టె తినిపిస్తుంది.

అమ్మా నువ్వు తినవేం? అన్నాడు గోపి తల్లిని, నువ్వు తిను ముందు,

నూ తిను అమ్మా! అంటూ ఓముక్క తల్లినోట్లో పెట్టేడు. కొద్దిగా నమిలి పళ్లెంలో రొట్టెవైపు అదో ధ్యానంగా చూసి చూసి నోట్లో ముక్కను ఊసేసింది.

ఏం అమ్మా! బాగో లేదూ?

నూ తిను, నాకు సహించటంలేదు అని అతనికి తినిపించి లేచి చంటిపిల్ల ప్రక్కలో పరుండి వెక్కి వెక్కి ఏడుస్తుంది. తల్లి ఏడవటం చూసి గోపాల్ కంగారుపడి బేరమన్నాడు, ఇద్దర్నీ చూసి చంటిపిల్ల. ఇరుగు పొరుగు జేరి ఓదార్చేరు. ఇంతట్లో వీధిలో మిల్లు ఆగిపోయింది. ఎందుచేతో నంటూ గొడవబయలుదేరింది. అరగంటలో కూలీలంతా ఒకొకరూ ఇండ్లకు జేరేరు. కారణం ఏమిటంటే రమేశం విషం త్రాగినట్లు, ఆసుపత్రిలోకి తీసుకు వెళ్లినట్లు చెప్పేరు. నలిని ఈసంగతి వినగానే బొమ్మలా అయి పోయింది.

ఆసుపత్రిలో డాక్టర్లు విషానికి విరుగుడు ఇచ్చేరు, గుండె పరిక్షించేరు- రమేశం హృదయంలో ఏదో ఆవేదనుంది, అన్నారు తండ్రితో. రమేశం కళ్లుమూసుకుని అల్లానే పరుండిపోయేడు—

ఏమిటంటారది? అన్నాడు తండ్రి.

ఏదో బెంగ అనుకుంటాం, అన్నారు. తండ్రి మొహం ఎలానో అయింది. ఓ, డాక్టరు అతని దగ్గర ఉండిపోయేరు- తండ్రి మిగతా డాక్టర్లు బయట కొచ్చేసేరు.

రాత్రి ఎనిమిది గంట లయింది. ఆసుపత్రిలో దీపాలు తళ తళ మంటున్నయి. ఆవరణంతా ఎంతో నిశ్శబ్దంగా ఉంది. అప్పు డప్పుడు మాత్రం రోగుల మూల్గుడు వినబడుతుంది. నలిని ముసుగు సర్దుకుంటూ రమేశం ఎక్కడని ప్రశ్నించింది పచారుచేస్తున్నా నర్సును. ఆమె నలిన్ని క్రిందా మీదా పరికించి ఎందుకు? ఎవరు నువ్వు? అని ప్రశ్నించింది.

దాసీనంది ధైర్యంతో, ఈగదిలోనే ఉన్నాడు అని చూపింది చేత్తో నర్సు.

అతని స్థితి ఎల్లా ఉంది?

విషంవల్ల మరేభయం లేదుగాని........

మరి దేనివల్ల ?

అతని మనస్సులో ఏదో బెంగ ఉంది. విషం త్రాగటంవల్ల గుండె బలహీనం అయిపోయింది. అతని కోరిక తీరితేనే గాని లాభం లేదంది నర్సు. వెంటనే గదిలో ప్రవేశించింది నలిని. ప్రక్క దగ్గరనున్నా నర్సు చప్పుడి చేయకని సంజ్ఞ చేసింది. మెల్లిగా రమేశం మంచం దగ్గరకు జేరి కుర్చీమీద కూర్చుంది. నర్సు ఆశ్చర్యంతో చూస్తూఉండి పోయింది. నలిని రమేశం నుదుటమీద చెయ్యివేసింది. వెంటనే రమేశం అటునుంచిటు దొర్లేడు కళ్ళు తెరచేడు. వెంటనే నర్సు సీసాలో మందు గ్లాసులో పోసి నోటిదగ్గరపెట్టి త్రాగించింది. నలిన్నిచూసి కళ్లు పూర్తిగా తెరచి, నలినీ! అన్నాడు సేట్ !

నలినీ ! అంటూ కళ్ల వెంబడి నీళ్ళు కార్చేడు. నలిని కళ్లు తుడుస్తూ, భయంలేదు, బెంగెందుకు? అంది దీనంగా చూసేడు. నలిని అర్థం చేసుకుంది. భయపడకు, నువ్వు చెప్పినట్లు చేస్తా అంది. వెంటనే రమేశం మొహంలో చిరునవ్వు కనబడింది.

నలిని రమేశం విషంత్రాగేడన్న దగ్గరనుంచి ఆమె మనస్సు స్థిమితం తప్పింది. అన్నివిధాలా ఆలోచించింది, రమేశానికి యిరువై సంవత్సరాల వయస్సున్నప్పటికీ, అతని హృదయాన్ని, స్థితిని బట్టి అతన్నికూడా చంటి కుర్రాన్నిగా భావించింది. భావి ప్రపంచానికి ముగ్గురు కసుగందుల్ని నిల్పింది. లోకాన్ని సంఘాన్ని రెండు గుప్పిట్లలో నుఇమిడ్చుకుంది అయిదు సంవత్సరాలవరకూను.

